క్లుప్తంగా

కమేళాల పరిశీలన



కమేళా వద్ద స్థానికులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని గొర్రెల, మేకల కమేళాలను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కమేళాలలో ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, మురుగు కాలువల పరిస్థితిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలువల్లోని వ్యర్థ పదార్థాలను ఏరోజుకారోజు శుభ్రమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమేళా నిర్వాహకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, లేనిపక్షంలో ప్రజారోగ్యం దెబ్బ తినే అవకాశం ఉందన్నారు.

పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 24వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రదీప్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మంగళవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట సోమిరెడ్డి, దారాల శ్రీను, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్

నందవరం : మండల కేంద్రం నందవరంలో పంపయ్య జాతర సందర్భంగా పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. మంగళవారం గ్రామంలో సరళ వీధి, పంపయ్య దేవాలయం, ఆయా వీధుల్లో పారిశుద్ధ్య పనులను ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఈ నెల 12వ తేదీ పంపయ్య జాతర సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు. పనుల్లో భాగంగా మురుగు కాలువలు, నీటి కుంటలు, కంప చెట్లు, చెత్త కుప్పలు తొలగించి శుభ్రం చేయించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కాత్రికి



విజేత జట్టుకు నగదు అందిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో మల్లికార్జుస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో కాత్రికి జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్లకు మంగళవారం నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. విజేత జట్టుకు మండల నాయకుడు నరసింహులు మొదటి బహుమతి రూ.15వేలు అందించగా, రన్నరప్ బదినేహాల్ జట్టుకు లక్ష్మన్న రూ.10వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు.

తోటి ఉపాధ్యాయుడికి చేయూత



బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అంజి నాలుగు రోజుల క్రితం పొలంలోని టెంకాయ చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆదోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వెన్నముక విరిగిపోయిందని ఆపరేషన్ చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు తలా ఓ చెయ్యి వేసి రూ.23,500 పోగుచేశారు. మంగళవారం ఆదోని వెళ్లి బాధితున్ని పరామర్శించి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నందవరం : ఉపాధి కూలీలు కచ్చితమైన కొలతలతో పని చేస్తే రోజు వారీ వేతనం రూ.300 లభిస్తుందని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురంలో ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం మస్టర్లు, ఉపాధి కూలీల హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, ఉపాధి కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీఏ శివకుమార్, సీనియర్ మేట్ పాల్గొన్నారు.

సంక్రాంతి అన్నారు..

ఉగాది కూడా పాయే!

- మహిళలకు ఉచిత బస్సు అని ఎన్నికల ముందు కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోని వైనం
- అసహనం వ్యక్తం చేస్తున్న మహిళలు



ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండులో బస్సెక్కుతున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం.. ఆర్టీసీ బస్సులో ఎక్కి ఎక్కడికైనా వెళ్లొచ్చు.. ఇది కూటమి ప్రభుత్వం మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో అమలు చేస్తాం.. అని స్వయాన ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రసంగాల్లో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇదిగో.. ఉచిత బస్సు ప్రయాణం అదిగో.. అంటూ కూటమి ప్రభుత్వం వాయిదాలపై వాయిదాలు వేస్తూ వస్తోంది. త్వరలో ఉచిత బస్సు ప్రయాణం అంటూ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సైతం ప్రకటించారు. అయితే కార్యరూపం మాత్రం దాల్చలేదు. దీంతో తమకిచ్చిన హామీ అసలు అమలవుతుందా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ, కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు..

టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం హామీ ఒకటి. ఉచిత బస్సు పథకంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు అని టీడీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేసి మహిళలతో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం మాత్రం హామీ అమలు చేయడంలేదు. ఓవైపు తెలంగాణ, మరో వైపు కర్ణాటక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశాయి. అయితే మనరాష్ట్రంలో మాత్రం ఇంత వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోతోంది కూటమి ప్రభుత్వం. ఉచిత బస్సు ప్రయాణంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి వర్గ బృందం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలిచ్చినా అమలు చేసేందుకు మాత్రం కూటమి సర్కార్ నిర్ణయం తీసుకోలేకపోతోంది.

అప్పుడు.. ఇప్పుడు అంటూ..

మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15వ తేదీ నుంచి అని ఒకసారి, సంక్రాంతి అనిమరో మారు, దీపావళికి అని, ఉగాదికి పక్కా అని ఇలా కూటమి మంత్రులు, నేతలు ప్రకటనలిస్తూ మహిళలను మభ్యపెడుతూ వస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్ అమలు చేయాలంటే భయమేస్తోందని స్వయాన అసెంబ్లీలో పేర్కొనడం చూస్తే అసలు అమలు చేస్తారా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మహిళల ఎదురు చూపులు

ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కోసం నియోజకవర్గంలో మహిళలు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో 2,47,752 మంది ఓటర్లుండగా అందులో 1,25,664ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికై ఆశగా ఎదురు చూసే పరిస్థితి నెలకొంది.

హామీ అమలులో జాప్యం తగదు



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయడం తగదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంతవరకు ఈ హామీపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. – **ఈరమ్మ, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి**

ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఇచ్చిన హామీని అమలు చేయాల్సిందే. ఓట్ల కోసం ఎన్నికల ముందు హామీలిచ్చి ఇప్పుడు వాటిని చూస్తే భయమేస్తుందని ముఖ్యమంత్రే చెప్పడం ఆశ్చర్య కలిగిస్తోంది.

– **భవాని, ఎమ్మిగనూరు**

ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభం

కోసిగి: 2025–2026 విద్యాసంవత్సరానికి గానూ ఈనెల 7వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించినట్లు కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు కళాశాలలో పేర్లు నమోదు చేసుకుని, తరగతులకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థులకు టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్‌లతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించి ఈఏపీ సెట్, నీట్ మెటీరియల్స్ ఇవ్వబడుతుందన్నారు. అలాగే కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 1 నుంచి ఇంటర్మిడియెట్ సెకండియర్ తరగతులు జరుగుతున్నట్లు తెలిపారు.

టిడ్కో సముదాయానికి బస్సు సౌకర్యం

ఆదోని టౌన్: పట్టణంలోని మదిరె రోడ్డులో ఉన్న టిడ్కో గృహ సముదాయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రఫిక్ అహ్మద్ తెలిపారు. మంగళవారం డిపో వద్ద బస్సును ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ.. పట్టణశివారులో ఉన్న టిడ్కో గృహ సముదాయం నుంచి పట్టణంలోకి వచ్చి పోవాలంటే దాదాపు ఆరు కి.మీ. అవుతుందని, నిత్యావసర సరుకుల కొనుగోలు, ఆసుపత్రులకు వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. పేద ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ

గోనెగండ్ల : షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసర్చ్ వారి సహకారంతో కర్నూలు ఏరువాక కేంద్రం వారు కులుమాల గ్రామంలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ, శాస్త్రవేత్త రవి కిషోర్ హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల సాగులో మెళకువలు, విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఏఓ హేమలత, గ్రామ ఉద్యాన సహాయకులు రహీమ్, ఎఫ్‌పీఓ సభ్యులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి సంవత్సరం రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు. కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం తక్షణమే సమగ్ర కౌలు చట్టాన్ని అమలు చేయాలన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనుల కోసం విడుదల చేసిన జీవో 404, 405 రద్దు చేసి వెంటనే లైనింగ్ పనులు ఆపాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు హనుమంతు, మదిరె నాగరాజు, సౌరప్ప, నారాయణ, పీఓడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మణి, మహాదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

గోనెగండ్ల : అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల నాయకుడు నబి రసూల్ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏదైతే ఉందో పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల రుణాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, బజారి, హనుమంతు, సురేష్, మహబుబ్‌బీ, కాజా పటేల్, షాహిన్‌బీ, పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 12న రామలింగేశ్వర స్వామి రథోత్సవం



వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కందుకూరు గ్రామస్తులు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీటీసీ కురువ మల్లయ్య, తాయన్న తెలిపారు. మంగళవారం గ్రామస్తులు ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఈనెల 10న ఉత్సవాలకు అంకుర్పారణ, 11న గణపతి పూజ, వాస్తు పూజ, వాస్తుబలి, అభిషేకం, జలాధివాసం, హోమాలు ఉంటాయన్నారు. 12వ తేదీ వేకువ జామున నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, గోపుర కలశ ప్రతిష్టాపన చేపట్టి, పార్వతీ పరమేశ్వర కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య స్వామి వారి మహా రథోత్సవ ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు మాజీ ఎంపీటీసీ రమేష, చంద్రన్న స్వామి, రాజశేఖర్ స్వామి, మల్లయ్య స్వామి, వీరయ్య గౌడ, యంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన కోయలకొండ రాముడు (55)మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామంలో ఇంటి ముందు రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తుండగా ఇనుప రేకులకు కరెంటు ప్రవహించి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు ఉన్నారు.

గిన్నిస్‌బుక్‌లో భాగస్వామ్యం అభినందనీయం



గిన్నిస్ బుక్ సర్టిఫికెట్ చూపుతున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: మెప్మా పరిధిలోని ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన 1,35,000 ఉత్పత్తులను మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విక్రయించడం ద్వారా గిన్నిస్ బుక్‌లో స్థానం లభించడం అభినందించదగ్గ విషయమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. ఈమేరకు గిన్నిస్ బుక్ రికార్డ్ సర్టిఫికెట్లను మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో కలిసి మీడియాకు చూపించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మెప్మాలోని పొదుపు మహిళలు విక్రయించిన ఉత్పత్తుల్లో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులున్నాయన్నారు. స్థానిక మెప్మా విభాగం ద్వారా వెయ్యి వరకు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయించారని చెప్పారు. గిన్నిస్ బుక్ రికార్డ్‌లో స్థానం పొందిన మెప్మా విభాగంలో ఎమ్మిగనూరు మహిళల భాగస్వామ్యం వుండటంతో గర్వకారణమన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకై పోరాడుదాం

ఆదోని రూరల్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో భారత రాజ్యాంగ పరిరక్షణకై పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో సీపీఐ పట్టణ, మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, మండల కార్యదర్శి కల్లుబావిరాజు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుట కోసం లౌకికవాదులంతా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 14వ తేదీన బహిరంగ సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎ.విజయ్‌కుమార్, పట్టణాధ్యక్షులు వై.టి.భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి

గోనెగండ్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు గంజిహళ్లి మహదేవ్, కరుణాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ జయంతి, రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను తహసీల్దార్ కుమారస్వామి చేతుల మీదుగా విడుదల ఆవిష్కరించారు. ఈనెల 14న ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణంలోని ఆది ఆంధ్ర పాఠశాల, ఎంబీ చర్చి దగ్గర నుంచి సభా స్థలం వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జోజి, క్రాంతి, నాగేష్, రాజు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై టీడీపీ నాయకుల మధ్య జరిగిన సంభాషణపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఇసుక అక్రమ రవాణాకై తరలించే టిప్పర్లకు రూ.50వేలు సీఐకి ఇచ్చామని, అదేవిధంగా ఇసుక తరలించేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అనుమతి ఇచ్చారంటూ టీడీపీ నాయకులు మొబైల్‌లో మాట్లాడిన సంభాషణ వైరల్ అయ్యిందన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ సమర భేరిని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ సమర భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జైరాజ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రన్న పిలుపునిచ్చారు. మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సమర భేరి పోస్టర్లను ఆవిష్కరించారు.

హామీలు నెరవేర్చమంటే.. భారం వేస్తారా?

పెద్దకడబూరు : కేంద్ర, కూటమి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే ప్రజల నెత్తిన భారం మోపి తాము ఏమిటో నిరూపించుకుంటున్నాయని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ మండిపడ్డారు. వంట గ్యాస్‌పై రూ. 50లు పెంచినందుకు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, రామాంజినేయులు, ఖాజా, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల సర్వేపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: దీర్ఘ కాలిక వ్యాధులపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేపై దృష్టి సారించాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఖిబులా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు, వైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు, సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, మలేరియా, డెంగీ తదితర వ్యాధులతో బాధపడే వారిని గుర్తించాలన్నారు. వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ మేరకు వైద్యం అందిచాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో వైద్యులు నిస్సి గ్రేసి, వీణ, శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో బసవేశ్వర స్వామి విగ్రహ ఏర్పాటుకు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మంగళవారం తన స్వగృహం రాంపురంలో గ్రామ పెద్దలకు రూ.25వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ వల్లూరు గ్రామంలో నూతనంగా బసవేశ్వర విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలుపడంతో తన వంతుగా రూ.25వేల నగదును అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలమాల శాలువాతో సన్మానించి బసవేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మరేగౌడ, ఈశప్ప గౌడ్ ఉన్నారు.

పశువుల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పశువుల, గొర్రెల మార్కెట్‌లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీవుల్లా డిమాండ్ చేశారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలకు వచ్చే మూగజీవాల యజమానుల వద్ద జకాయితీ వసూలు చేస్తున్నారేకానీ సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గొర్రెల మార్కెట్‌లో జకాయితీ రూ.30లు వసూలు చేయాల్సి వుండగా రూ.50లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అయినా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ జబ్బార్, దాదావలి, తిమ్మగురుడు, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం

ఎమ్మిగనూరుటౌన్: వంట గ్యాస్ ధరను పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపైనే పెను భారం మోపినట్లు అయ్యిందని ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి యు.ఈరమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు పెంచడంతో ప్రస్తుతం సిలిండర్ ధర రూ.908లకు చేరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి మొదటి సిలిండర్‌కే డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి పెంచిన సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య నాయకులు వాణి, నాగవేణమ్మ, ఉరుకుందమ్మ, శాంతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా నెల్లూరమ్మ దేవర

తుగ్గలి: మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్ర నాగప్ప యాదవ్ తమ ఇంటి ఆరాధ్య దైవం, గ్రామ దేవత నెల్లూరమ్మ దేవరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు హాజరయ్యారు.

రమణీయం.. వేంకటేశ్వరస్వామి రథోత్సవం



ఉరేగింపుగా తమ పూర్వీకుల ఫొటోలతో వస్తున్న ఆలయ ధర్మకర్తలు



గ్రామ వీధుల్లో స్వామి వారి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం రమణీయంగా జరిగింది. ముందుగా తెల్లవారుజామున ఆలయ ధర్మకర్తలు సీబీ జానకీరామిరెడ్డి, సీబీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీబీ వసుసుందరమ్మ, సీబీ విజయమ్మ ఇంటి నుంచి వారి పూర్వీకుల ఫొటోలతో ఉరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిగా రథోత్సవం భక్తుల హర్షధ్వానాల మధ్య సాగింది. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.